సాక్షి
నిర్మల్
గురువారం । 23 । నవంబర్ । 2023



అభివృద్ధికే.. తొలి ఓటు

అభివృద్ధి చేసినవారికే ఓటేస్తామని 18 ఏళ్లు నిండి కొత్తగా ఓటు హక్కు వచ్చిన యువతీయువకులు పేర్కొన్నారు. సేవా గుణం గల నాయకుడికే పట్టం కడతామని చెబుతున్నారు. 10లో▸



ఓటర్లు పెరిగారు

ఆదిలాబాద్ జిల్లాలో గడిచిన ఐదేళ్లలో 64వేల వరకు ఓటర్లు పెరిగారు. 2018లో 3,84,136 మంది ఉండగా.. ప్రస్తుతం ఈ సంఖ్య 4,48,374కు పెరిగింది. 10లో▸

గరిష్ఠం/కనిష్ఠం
32.0 /22.0

వాతావరణం

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. చలి పెరుగుతుంది. రాత్రి మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

హెలిప్యాడ్ వద్ద డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు



హెలిప్యాడ్ ప్రాంతంలో తనిఖీ చేస్తున్న అధికారులు

ఖానాపూర్: ఈనెల 26న ఖానాపూర్‌లో నిర్వహించనున్న ప్రజా ఆశీర్వాద సభకు సీఎం కేసీఆర్ హాజరు కానున్న నేపథ్యంలో బుధవారం పట్టణంలోని సాయిబాబా ఆలయం ఎదుటగల మైదానంలో హెలిప్యాడ్, ఇతర ఏర్పాట్లను అధికారులు పరిశీలించారు. సీఎం సభ నేపథ్యంలో యంత్రాంగం పటిష్ట బందోబస్తు చేపట్టనుంది. ఇందులో భాగంగా స్థానిక అధికారులు, సిబ్బంది హెలిప్యాడ్ కోసం మార్కింగ్ చేయిస్తూ పరిసరాలు శుభ్రం చేయించారు. స్థానిక పోలీస్ అధికారులు, డాగ్‌స్క్వాడ్ బృందం ఆధ్వర్యంలో హెలిప్యాడ్ ప్రాంతంలో ముమ్మర తనిఖీలు చేపట్టారు.

విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంచాలి




రికార్డులు పరిశీలిస్తున్న ఆర్జేడీ

కడెం: విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆర్జేడీ సత్యనారాయణరెడ్డి, డీఈవో రవీందర్ రెడ్డి సూచించారు. బుధవారం మండలంలోని ఉడుంపూర్ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల పఠన సామర్థ్యాలు, పాఠశాల రికార్డులు పరిశీలించారు. ఎఫ్ఎల్ఎన్, రీడ్ టూ రూమ్ గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట సీఆర్పీ సోలమన్‌నాయక్, హెచ్ఎం, ఉపాధ్యాయులున్నారు.

నిన్నో పార్టీ.. నేడో పార్టీ

- స్పీడ్‌గా మారుతున్న కండువాలు
- అన్ని పార్టీల్లో జంపింగ్ జపాంగ్‌లు
- ప్యాకేజీల ఎర వేస్తున్న అభ్యర్థులు!



నిర్మల్ ఖిల్లా: బలం, బలగాన్ని పెంచుకునేందుకు అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచిన ప్రధాన పార్టీల అభ్యర్థులు తీవ్ర పోటీపడుతున్నారు. ప్రత్యర్థి పార్టీలోని ప్రధాన అనుచరులు, కార్యకర్తలు, ద్వితీయ శ్రేణి నాయకులను తమ పార్టీలోకి ఆహ్వానిస్తున్నారు. దీంతో నాయకులు, కార్యకర్తలు రాత్రికిరాత్రే కండువాలు మారుస్తున్నారు. ముందురోజు వరకూ ఓ పార్టీలో ఉన్నవారు మరుసాటిరోజే మరో పార్టీ కండువాలతో దర్శనమిస్తుండడంతో ఓటర్లు విస్తుపోతున్నారు. మరోవైపు ప్రచార హడావుడిలో తమ అభ్యర్థి పట్టించుకోవడంలేదనే ఆవేదనలో కొందరు నాయకులు మరో పార్టీ వైపు తొంగి చూస్తున్నారు. ఇందుకు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వార్డు మెంబర్లు, మండల, జిల్లా స్థాయి నాయకులకు ఇత ర పార్టీల అభ్యర్థుల నుంచి ప్యాకేజీలు అందుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. పోలింగ్ మరో ఏడు రోజులు ఉండగా ఇటు నుంచి అటు.. అటు నుంచి ఇటు.. జంపింగ్‌లు సర్వసాధారణమైపోయాయి. దీంతో ఏ సమయానికి ఎవరు, ఏ పార్టీలో ఉంటున్నారో తెలియని గందరగోళ పరిస్థితి నెలకొంది.

పశువైద్య శిబిరం



గొర్రెలకు మందులు వేస్తున్న సిబ్బంది

ఖానాపూర్: మండలంలోని ఎర్వచింతల్ గ్రామంలో బుధవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలోని 539 మేకలు, వెయ్యి గొర్రెలకు పీపీఆర్ టీకాలు వేయించినట్లు వెటర్నరీ అధికారి దీప్తి తెలిపారు. 50 గేదెలు, 58 ఆవులకు ఎఫ్ఎండీ టీకాలు, అల్బెండిజం, డివార్మింగ్ మాత్రలు అందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డ్రీమ్ సొసైటీ ప్రోగ్రాం కోఆర్డినేటర్ చిన్నయ్య, సిబ్బంది నారాయణ, నర్సయ్య ఉన్నారు.

కర్షక సంక్షేమమేది?

- అందని సబ్సిడీ యంత్ర పరికరాలు
- వైపరీత్యాలతో నష్టపోతే ఆదుకోలేదు
- సకాలంలో మాఫీ కాని పంట రుణాలు
- సాగురంగాన్ని ప్రోత్సహిస్తేనే ఓటేస్తాం
- సాక్షి 'రైతు ఎజెండా'లో అన్నదాతలు



భైంసాటౌన్: 'తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం రైతుబంధు, బీమా లాంటి పథకాలు అమలు చేస్తున్నా.. పెద్ద రైతులకే ఎక్కువ ప్రయోజనం చేకూరుతోంది. ప్రధానంగా కౌలు రైతులకు ఈ పథకం వర్తించకపోవడంతో అన్ని విధాలా వారు నష్టపోతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు ప్రభుత్వాలు గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో వ్యాపారులు చెప్పిన ధరకే అమ్ముకోవాల్సి వస్తోంది. ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోతే ఇన్‌పుట్ సబ్సిడీ కింద విత్తనాలు, ఎరువులు అందించడంలేదు. దీంతో కోలుకోలేని పరిస్థితి నెలకొంటోంది' అని రైతులు వాపోతున్నారు. 'సాగులో ఉపయోగించే యంత్ర పరికరాలపై సబ్సిడీ అందించకపోవడంతో చిన్న, సన్నకారు రైతులపై ఆర్థిక భారం పడుతోంది. పండించిన పంటలకు కేంద్ర ప్రభుత్వం అందించే మద్దతు ధరతోపాటు రాష్ట్ర ప్రభుత్వం బోనస్ అందిస్తే ప్రయోజనంగా ఉంటుంది' అని భావిస్తున్నారు.

కూరగాయల సాగును ప్రోత్సహించాలి

'సబ్సిడీపై డ్రిప్ పరికరాలు, వ్యవసాయ యంత్ర పరికరాలు అందించాలి. కూరగాయలు, ఉద్యానవన పంటల సాగు దిశగా ప్రోత్సహించాలి. సకాలంలో పంట రుణాలు మాఫీ చేయాలి. లేకుంటే పంటల ద్వారా వచ్చిన ఆదాయం వడ్డీకే సరిపోతోంది' అని ఆవేదన వ్యక్తంజేస్తున్నారు. ఈ నెల 30న అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు.. కొద్ది రోజుల్లో ఏర్పడే కొత్త ప్రభుత్వం రైతుల సంక్షేమానికి చేపట్టాల్సిన పనుల గురించి.. 'సాక్షి' రైతు ఎజెండాలో జిల్లాకు చెందిన పలువురు రైతులు తమ అభిప్రాయాలు వెలిబుచ్చారు.

గిట్టుబాటు ధర కల్పించాలి



ప్రభుత్వం రైతుబంధు మినహా ఎలాంటి పథకాలు వర్తింపజేయడం లేదు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో వ్యాపారులు చెప్పిన ధరకే విక్రయించుకోవాల్సివస్తోంది. ఎరువులు, పురుగుమందులు వ్యాపారులు చెప్పిన ధరకే మేము కొంటున్నపుడు.. మేము పండించిన పంటను కూడా మేము చెప్పిన ధరకే కొనాలి. సాగులో ఉపయోగపడే యంత్రాలపై సబ్సిడీ లేక మాలాంటి చిన్నరైతులకు సాగు భారమవుతోంది.

– యోగేశ్, గొడిసెర

సబ్సిడీపై యంత్రాలివ్వాలి

చిన్నకారు రైతులకు వ్యవసాయ యంత్ర పరికరాలు సబ్సిడీపై అందించాలి. విత్తనాలు, ఎరువులు రాయితీపై పంపిణీ చేయాలి. ప్రభుత్వమే మద్దతు ధరతో పంట ఉత్పత్తులు కొనుగోలు చేయాలి. స్ప్రేయర్లు, కల్టివేటర్లు, డ్రిప్ పరికరాలు సబ్సిడీపై అందించాలి.

– శివాజీ, సిద్దూర్

'కోత'లు నియంత్రించాలి

ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పంటల విక్రయ సమయంలో వ్యాపారులు ఇష్టారీతిన కోతలు విధిస్తున్నారు. రైస్‌మిల్లుల్లో కూడా తప్ప, తాలు పేరిట అదనంగా కోతలు పెడుతున్నారు. ధాన్యం తూకాల్లో కోతలు నియంత్రించాలి. పంటలకు మద్దతు ధర పెంచి రైతులకు ప్రోత్సాహకం అందించాలి.

– నాగనాథ్, ఇలేగాం

పసుపు బోర్డు కావాలి



కుంటాల: పసుపును సుగంధ ద్రవ్యాల పంటగా భావిస్తారు. గత ప్రభుత్వం సుగంధ ద్రవ్యాల బోర్డును కేరళలో ఏర్పాటు చేసింది. ఇక్కడ పసుపు బోర్డు లేకపోవడంతో రైతులు పంట సాగుకు మొగ్గు చూపడం లేదు. కొందరు రైతులు సాగుచేసినా.. మద్దతు ధర లేక నష్టపోతున్నారు. ఆర్మూర్ ప్రాంతంలో పసుపు బోర్డు ఏర్పాటు చేస్తే లాభదాయకంగా ఉంటుంది.

– సంతోష్ దేశ్‌పాండే, ఓలా

నష్టపోయినోళ్లను ఆదుకోవాలి



ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందించి ప్రభుత్వాలు ఆదుకోవాలి. రైతుబంధు పథకంతో పెద్ద రైతులకే ప్రయోజనం చేకూరుతోంది. యంత్ర పరికరాల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. యాంత్రీకరణలో భాగంగా పరికరాలను సబ్సిడీపై అందించాలి. పండించిన పంటలకు బోనస్ చెల్లించాలి.

– శంకర్, చొండి

మద్దతు ధర పెంచాలి

నియోజకవర్గంలో రైతులు పత్తి, సోయా ఎక్కువగా సాగు చేస్తారు. సరైన మద్దతు ధర లేక ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించి నష్టపోతున్నారు. తేమ శాతం పేరిట తక్కువ ధర చెల్లిస్తున్నారు. మద్దతు ధర పెంచితే రైతులకు ప్రయోజనం చేకూరుతుంది. – చక్రధర్, భైంసా

రుణమాఫీలో జాప్యం వద్దు



ప్రభుత్వం రుణమాఫీ చేస్తానని ప్రకటించింది. అర్హులైన రైతులందరికీ సకాలంలో అమలు చేయాలి. నాకు ఇప్పటివరకు రుణమాఫీ కాలేదు. ఎన్నికైన ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం పని చేయాలి. రైతు బాగున్నప్పుడే దేశం బాగుంటుంది. పంటలసాగు మొదలు సబ్సిడీపై యంత్ర పరికరాలు, నష్టపరిహారం వంటివి అమలు చేస్తే చిన్నసన్నకారు రైతులకు ప్రయోజనం ఉంటుంది.

– మల్లేశ్, సాంగ్వి

ఇంటి వద్దే ఓటేశారు





ఓటేసినట్లు వేలు చూపుతున్న లింబగిరి, గంగుబాయి

కుంటాల: అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా ఎన్నికల సంఘం 80 ఏళ్ల పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఇంటి వద్దే ఓటేసే అవకాశం కల్పించింది. ఇందులో భాగంగా మండల కేంద్రానికి చెందిన మాజీ పట్వారి సాదుల లింబగిరి అనే వందేళ్ల వృద్ధుడు బుధవారం ఇంటి వద్దే ఓటు వినియోగించుకున్నాడు. మొదటిసారి ఇలా ఇంటి వద్ద ఓటేసే అవకాశం దక్కినందుకు లింబగిరి ఆనందం వ్యక్తం చేశాడు. వందేళ్ల వయస్సులో ఓటు వినియోగించుకున్న అతడిని పలువురు అభినందించారు.

భైంసా పట్టణంలో..

భైంసాటౌన్: పట్టణంలోని రాహుల్‌నగర్‌కు చెందిన గంగుబాయి (84) అనే వృద్ధురాలు బుధవారం ఇంటి వద్దే ఓటు వినియోగించుకుంది. పోలింగ్ అధికారులు బ్యాలెట్ పత్రం, బ్యాలెట్ బాక్స్‌తో ఆమె ఇంటికి వచ్చారు. ఇంటి వద్దే గంగుబాయికి ఓటేసే అవకాశం కల్పించారు. మండలంలో 38 మంది పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్నట్లు ఈ సందర్భంగా అధికారులు తెలిపారు.

'డబుల్ బెడ్రూం' ఇళ్ల నిర్మాణంలో నాణ్యతకు తిలోదకాలు

ఖానాపూర్: మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్మించిన డబుల్‌బెడ్రూం ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యత లోపించిందని కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఆరోపించారు. బుధవారం పట్టణంలోని డబుల్ బెడ్రూం ఇంట్లో విద్యుత్ ప్రమాదం జరిగిన నేపథ్యంలో బాధిత కుటుంబాన్ని వారు పరామర్శించి మాట్లాడారు. ఇక్కడ నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లు ప్రారంభానికి ముందే పగుళ్లు తేలి అధ్వానంగా ఉన్నాయని తెలిపారు. కనీస సౌకర్యాలు సక్రమంగా లేవని, వానాకాలంలో గదులన్నీ ఉరుస్తూ లబ్ధిదారులు అందులో ఉండలేని పరిస్థితి ఉందని ఆరోపించారు. డబుల్ బెడ్రూం ఇళ్ల నాణ్యతపై విచారణ చేపట్టి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో బీజేపీ నాయకురాలు సొనాలి, కాంగ్రెస్ నాయకులు నిమ్మల రమేశ్, షబ్బీర్‌పాషా తదితరులున్నారు.

ఓటుకు 'దూరం'

- విదేశాల్లో 30వేల మంది జిల్లావాసులు
- వీరిది ఓటు వినియోగించుకోలేని స్థితి
- ఆన్‌లైన్‌లో ఓటేసేలా చూడాలని విజ్ఞప్తి



భైంసాటౌన్: ఉపాధి కోసం దేశం విడిచి వెళ్లిన ఎంతోమంది ఓటుకు దూరమవుతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులు, వృద్ధులు, దివ్యాంగులు, సర్వీస్ ఓటర్లకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే అవకాశం కల్పించిన ఎన్నికల సంఘం తమపై దృష్టి సారించాలని గల్ఫ్ కార్మికులు కోరుతున్నారు. పోలింగ్ కేంద్రాలకు రాలేని వృద్ధులు, దివ్యాంగులు ఓటు వినియోగించుకునేలా చూస్తే తద్వారా పోలింగ్ శాతం పెరుగుతుందని భావించిన ఎన్నికల అధికారులు ఈసారి వారికీ పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించారు. ఓటు ప్రాముఖ్యతను తెలిపేలా ప్రధాన కూడళ్లు, ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రచార ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. కానీ.. వేల సంఖ్యలో ఉన్న గల్ఫ్ కార్మికులకు కూడా ఆన్‌లైన్ విధానంలో ఓటు వేసే అవకాశం కల్పిస్తే పోలింగ్ శాతం మరింత పెరిగే అవకాశముంది.

గెలుపోటములపై ప్రభావం

స్థానికంగా ఉపాధి కరువై జిల్లా నుంచి దాదాపు 30 వేల మంది కార్మికులు గల్ఫ్‌దేశాలకు వెళ్లారు. 2009 ఎన్నికల్లో ముధోల్ అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రజారాజ్యం పార్టీ నుంచి పోటీ చేసిన జీ విఠల్‌రెడ్డి 183 ఓట్ల తేడాతో వేణుగోపాలాచారి చేతిలో ఓటమి చెందారు. ఇదే ఎన్నికల్లో నిర్మల్ నియోజకవర్గంలో ఇంద్రకరణ్‌రెడ్డి మహేశ్వర్‌రెడ్డి చేతిలో 2,545 ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. 1999లో టీడీపీ నుంచి పోటీచేసిన మాజీ ఎమ్మెల్యే భోస్లే నారాయణ్‌రావు పటేల్ గడ్డెన్న చేతిలో 850 ఓట్ల తేడాతో ఓడిపోయారు. ఇలా స్వల్ప ఓట్ల తేడా అభ్యర్థుల జయాపజయాలను ప్రభావితం చేస్తున్న నేపథ్యంలో వేలసంఖ్యలో ఉన్న గల్ఫ్ కార్మికులకు ఓటుహక్కు కల్పిస్తే సరైన తీర్పు రానుందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

'గోస' తెలిపేదెలా?

ఉపాధి కోసం గల్ఫ్ దేశాల బాట పట్టిన ఎంతోమంది కార్మికులు బయటి దేశాల్లో ఇబ్బందులు పడుతున్నారు. అక్కడి ప్రభుత్వాలు కార్మికుల సంక్షేమాన్ని విస్మరిస్తున్నాయి. ఎంతోమంది అసౌకర్యాల మధ్య మగ్గుతున్నారు. అప్పు చేసో.. ఆస్తులు అమ్ముకునో బయటి దేశం వెళ్తే అక్కడ అనుకోని సందర్భాల్లో వివిధ కారణాలతో మరణాలు సంభవిస్తే నెలలు గడిచినా వారి మృతదేహాలు సొంతగడ్డకు తీసుకురాలేని సందర్భాలనేకం ఉన్నాయి. దేశం విడిచి కుటుంబాలకు దూరంగా బతుకు వెల్లదీస్తున్న తమ గోడు ప్రభుత్వాలకు చెప్పుకొందామంటే కనీసం ఓటు వినియోగించుకోలేని పరిస్థితి నెలకొందని వారు ఆవేదన చెందుతున్నారు. ఓటు వేసేందుకు అక్కడి నుంచి రాలేని పరిస్థితుల నేపథ్యంలో ఆన్‌లైన్ ద్వారా, లేదా ఇతర విధానంలోనైనా తాము ఓటు వినియోగించుకునే అవకాశం కల్పించాలని వారు కోరుతున్నారు.

ఓటు కోసం రాలేము





వృత్తిరీత్యా దాదాపు ఎనిమిదేళ్ల నుంచి ఇండియానాలో ఉంటున్నాం. నాకు ముధోల్ నియోజకవర్గంలో, నా భార్యకు వరంగల్ జిల్లా హసన్‌పర్తిలో ఓటు ఉంది. ఎన్నికల సమయంలో ఓటు వినియోగించుకోలేకపోతున్నం. ఆన్‌లైన్ ద్వారా ఓటు వేసే అవకాశం కల్పించాలి.

– విక్రమ్, విష్ణుప్రియ, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, ఇండియానా

ఓటు వేసే అవకాశమివ్వాలి



నేను కొన్నేళ్లుగా దుబాయ్‌లోని ఓ కంపెనీలో పని చేస్తున్న. భైంసా పట్టణంలో నాకు ఓటున్నా ఎన్నికల్లో ఓటేయలేని దుస్థితి. ఓటు వేసేందుకు ఇండియాకు రాలేని పరిస్థితి. మాకు పోస్టల్ ద్వారా.. లేదా ఇతర విధానంలో ఓటు వేసే అవకాశం కల్పించాలి.

– సతీశ్, గల్ఫ్ కార్మికుడు, భైంసా

'అందరూ ఓటు వినియోగించుకోవాలి'



ర్యాలీ నిర్వహిస్తున్న విజయలక్ష్మి, అధికారులు

లోకేశ్వరం: ప్రతి ఒక్కరూ ఓటు వినియోగించుకోవాలని డీఆర్డీవో విజయలక్ష్మి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రధాన వీధుల్లో ఓటు వినియోగంపై ర్యాలీ నిర్వహించగా ఆమె హాజరై మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అన్ని సౌకర్యాలు కల్పించామని, దివ్యాంగుల కోసం ర్యాంపులు ఏర్పాటు చేశామని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉండి ఓటర్లకు సేవలందించాలని సూచించారు. ఎంపీడీవో సోలమాన్‌రాజ్, ఏపీవో జగన్నాథ్, ఈసీ అనిల్, ఏపీఎం మల్లేశ్, ఐకేపీ సీఏలున్నారు.

నర్సరీలు పకడ్బందీగా నిర్వహించాలి

గ్రామాల్లో నర్సరీలు ఏర్పాటు చేసి పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్డీవో విజయలక్ష్మి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందితో సమావేశమై మాట్లాడారు. మొక్కల పెంపకం కోసం నర్సరీలకు ఎర్రమట్టి, నల్లమట్టి తరలించాలని, నర్సరీల చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని సూచించారు. ఆమె వెంట ఎంపీడీవో సోలమాన్‌రాజ్, ఏపీవో జగన్నాథ్ ఉన్నారు.

ఓటర్లకు అవగాహన కల్పించాలి

భైంసాటౌన్/భైంసారూరల్: ఓటు హక్కు వినియోగంపై విస్తృతంగా అవగాహన కల్పించాలని డీఆర్డీవో విజయలక్ష్మి సూచించారు. బుధవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఐకేపీ, ఈజీఎస్ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం నుంచి ఓటు వినియోగంపై ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఓటర్లను కలిసి ఓటు వినియోగంపై అవగాహన కల్పించారు.

హలో ఇంద్రకరణ్.. ప్రచారం ఎట్లుంది?



సీఎం కేసీఆర్‌తో సెల్‌ఫోన్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

- ఫోన్‌లో ఐకేరెడ్డిని ఆరా తీసిన కేసీఆర్

సారంగపూర్: మండలంలోని చించోలి(బీ) గ్రామంలో బుధవారం మంత్రి, బీఆర్ఎస్ నిర్మల్ అభ్యర్థి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ప్రచారం ప్రారంభించారు. ఈ సమయంలో ఆయనకు సీఎం కేసీఆర్ ఫోన్ చేసి ప్రచార తీరుపై ఆరా తీశారు. కాగా, సీఎం కేసీఆర్ తనకు ఫోన్ చేసి చెప్పిన విషయాలను ఐకేరెడ్డి ఓటర్లకు వివరించారు. సీం కేసీఆర్, మంత్రి అల్లోల మధ్య ఫోన్ సంభాషణ ఇలా సాగింది.

కేసీఆర్: హలో ఇంద్రకరణ్.. ప్రచారం ఎలా సాగుతోంది?

ఇంద్రకరణ్‌రెడ్డి: హలో సార్.. ప్రచారం బాగానే సాగుతోంది. ప్రతీ గ్రామంలో ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు.

కేసీఆర్: ఈసారి ఎన్నికల్లో నీదే పైచేయి ఉందని సర్వేలు చెబుతున్నాయి. నీ ప్రచారం ఇంకా జోరందుకోవాలి.

ఇంద్రకరణ్‌రెడ్డి: అలాగే సార్.. మన మంచితనమే మనల్ని గెలిపిస్తుంది. అంతకంటే శుభవార్త మీరు చెప్పారు. థాంక్యూ సార్..

కేసీఆర్: ఆల్ ద బెస్ట్..

ఓటుహక్కుపై అవగాహన



ఓటు విలువ తెలుపుతూ నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు



వారసంతలో అవగాహన కల్పిస్తున్న విద్యార్థినులు

నర్సాపూర్(జి): విద్యార్థి దశ నుంచి ఓటుహక్కుపై అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కిషన్‌రావు పేర్కొన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఓటుహక్కుపై విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. అనంతరం వారసంతలో ఓటు విలువను వివరిస్తూ నృత్య ప్రదర్శన చేశారు. విద్యార్థులు సంతలో విక్రయదారులకు ఓటు ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ప్లకార్డులతో ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అయ్యప్ప దీక్షలు ప్రారంభం



పూజలు చేస్తున్న దీక్షాపరులు

కుంటాల: మండలంలోని ఆయా గ్రామాల్లో బుధవారం భక్తులు అయ్యప్ప దీక్షలు స్వీకరించారు. వీరికి కల్లూర్ శ్రీ ధర్మశాస్త అయ్యప్ప ఆలయ గురుస్వామి నర్సారెడ్డి మాలాధారణ చేశారు. మకర సంక్రాంతి వరకు నియమ నిష్టలతో ఈ దీక్షలు కొనసాగనున్నాయి. 41 రోజుల దీక్ష అనంతరం భక్తులు శబరిమలై వెళ్లి దీక్ష విరమణ చేస్తారు.

అభివృద్ధికే..తొలి ఓటు



• ప్రలోభాలకు లొంగవద్దు • సేవచేసే వారికే పట్టం కట్టాలి • యువ ఓటర్ల మనోగతం

కైలాస్‌నగర్: ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం లాంటిది. ఐదేళ్లకోసారి జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకుంటారు. ఈ క్రమంలో ప్రజాసేవ చేసే నాయకుడికే పట్టం కడతాం. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటేస్తామని అంటున్నారు జిల్లాలోని పలువురు యువ ఓటర్లు. అభివృద్ధికే తమ తొలి ఓటు అంటున్నారు. అభిప్రాయాలు వారి మాటల్లోనే..

పథకాలు అందించేవారికే ఓటు



కైలాస్‌నగర్: ప్రజలకు సంక్షేమ పథకాలు, ప్రజల అవసరాలు గుర్తించి తీర్చగలిగే అభ్యర్థినే ఓటు వేసి ఎన్నుకోవాలి. బరిలో నిలిచిన వారిలో సమర్థుడైన నాయకుడు ఎవరనేది ఆలోచించి విచక్షణతో నిజాయితీతో ఓటేయాలి. ప్రలోభాలకు గురై ఓటు వేస్తే ఐదేళ్ల పాటు అవస్థలు పడక తప్పదు.

– ఎం.స్వాతి

సంతోషంగా ఉంది



ఇచ్చోడ: మొదటిసారి ఓటు హక్కును నమోదు చేసుకున్నాను. ఎన్నికల్లో ఓటు వేసే అవకాశం రావడం సంతోషంగా ఉంది. సరైన వ్యక్తికి ఓటు వేస్తా. యువత ఓటు వినియోగించుకుని ఆదర్శంగా ఉండాలి. ఓటు వినియోగంపై నిర్లక్ష్యరాసులకు అవగాహన కల్పించాలి.

– ముండే వైష్ణవి, మన్నూర్, గుడిహత్నూర్ మండలం

ఓటు విలువైనది



ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు చాలా విలువైనది. ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేసే వ్యక్తిని ఎన్నుకోవాలంటే ఓటేయాలి. పూర్తిస్థాయిలో ఓటు వినియోగించుకోవాలి.

– బియ్యల అపర్ణ, సిరికొండ

నిర్భయంగా ఓటేయాలి



ఓటు వినియోగించుకుని ఉత్తమ నాయకులను ఎన్నుకోవాలి. ఎలాంటి ప్రలోభాలకు లొంగవద్దు. నిజాయితీతో నిర్భయంగా తమ ఓటు వినియోగించుకోవాలి.

– నిమ్మల విఠల్‌రెడ్డి, ఇచ్చోడ

అభివృద్ధి చేసేవారికే ఓటు



అభివృద్ధి చేసే నాయకులకే పట్టం కట్టాలి. వారిని ఎన్నుకోవడానికి ఓటు వేయడం మంచి అవకాశం. పవిత్ర గ్రంథమైన ఖురాన్ లాగా ఓటును భావించాలి. ఎలాంటి భయం లేకుండా ఓటేయాలి.

– ఇర్ఫాన్, కేశవపట్నం, ఇచ్చోడ మండలం

భవిష్యత్తు మార్చే ఆయుధం..



కైలాస్‌నగర్:మనం వేసే ఓటు మన భవిష్యత్తును మార్చే వజ్రాయుధం లాంటిది. ఓటు హక్కు కలిగిన ప్రతిఒక్కరూ ఆలోచించి సరైన నాయకుడిని ఎన్నుకోవాలి. ప్రజలకు ఎవరు మంచి చేయగలుగుతారో వారినే పట్టం కట్టాలి.

– కొప్పుల జగదీశ్

మంచి నాయకుడిని ఎన్నుకోవాలి



ఆదిలాబాద్: నాయకులనేవారు ఓటర్లకు మార్గదర్శకంగా ఉండాలి. నిజాయితీతో వ్యవహరించాలి. నాయకుల ప్రలోభాలకు యువత దూరంగా ఉండి, మంచి చేసేవారిని ఎన్నుకోవాలి. తమ ఓటును పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలి.– గాజరి కల్యాణి, పిట్టల్‌వాడ, ఆదిలాబాద్

తొలి ఓటు వేస్తా



ఇంద్రవెల్లి: తొలిసారిగా ఓటు హక్కు వచ్చింది. అభ్యర్థి గుణగణాలు తెలుసుకుని ఓటు వేస్తా. అభివృద్ధి చేసేవారినే యువత ఎన్నుకోవాలి. ఓటు వినియోగంపై తోటి మిత్రులకు అవగాహన కల్పిస్తా.

– షేక్ అమాన్, ఇంద్రవెల్లి, డిగ్రీ విద్యార్థి

ఉపాధి కల్పించాలి



ఆదిలాబాద్: దేశంలో యువత సంఖ్య అధికంగా ఉంటుంది. వారి భవిష్యత్ పట్టించుకోవాల్సిన బాధ్యత పాలకులు, ప్రజాప్రతినిధులపై ఉంది. వారికి సరైన ఉద్యోగ అవకాశాలు, ఉపాధి కల్పించాలి. సరైన నాయకుడిని ఎన్నుకునేందుకు ఓటు వినియోగించుకోవాలి.

– వంశీ, కోలిపురా, ఆదిలాబాద్

మార్పు అవసరం



కడెం: ప్రజలు, ఓటర్లలో మార్పు అవసరం. విద్య, వైద్యం అందించే పాలకులు, నాయకులను ఎన్నుకోవాలి. మంచి నాయకుడిని ఎన్నుకుంటారని ఆశిస్తున్నా. మొదటిసారి ఓటు హక్కును వినియోగించుకోవడం ఆనందంగా ఉంది.

– అంథోని గ్లోరియాఆకర్షిత, కడెం

ఓటు విలువైంది



కైలాస్‌నగర్:ఓటును వజ్రాయుధంగా భావిస్తాను. మంచి నాయకుడిని ఎన్నుకోవడానికి ఉపయోగిస్తాను. ఓటును దుర్వినియోగం చేయవద్దు. ఓటు చాలా విలువైంది. ప్రజాస్వామ్యంలో ఓటుకు చాలా ప్రాధాన్యత ఉంది. సేవ చేసే నాయకుడిని ఎన్నుకోవడమే ఓటు ప్రధాన ఉద్దేశం.

– ఎం.రాజేందర్

సేవచేసే పార్టీకే నా ఓటు



కొత్తగా ఓటు హక్కు వచ్చింది. పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుంటాను. ప్రజలకు సేవ చేసే పార్టీకే ఓటు వేస్తాను. ఓటు ఉన్న ప్రతిఒక్కరు బాధ్యతగా వినియోగించుకోవాలి. ఎవరు నోటాకు ఓటు వేయవద్దు. చదువుకున్న వారు చదువురాని వారికి ఓటు విలువను తెలియజేసి దాన్ని వినియోగించేలా చూడాలి.

– ఎస్.మనీషా

ఓటు బాధ్యతగా భావించాలి



ఓటు వినియోగించడం బాధ్యతగా భావించాలి. ఓటు వేయడం ద్వారానే సరైన నాయకుడిని ఎన్నుకోగలుగుతాం. అభ్యర్థి గెలుపునకు ఓటు కూడా కీలకం కానుంది. ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ఓటు వేయాలి. ప్రలోభాలకు లొంగకుండా నిజాయితీగా మనకు నచ్చిన వ్యక్తికి ఓటేయాలి.

– పి.అంజలి

అందుబాటులో ఉండాలి



ఓటు అనేది వజ్రాయుధం. సరైన నాయకుడిని ఎన్నుకోవాలి. ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా ఓటును వినియోగించుకోవాలి. సేవచేసేవారికి, ప్రజలకు అందుబాటులో ఉండే నాయకులను ఓటేయాలి. – ఆకిరెడ్డి భాను, కొండుకూర్

క్లుప్తంగా

'డబుల్ బెడ్రూం'లో అగ్నిప్రమాదం



దగ్ధమైన గది

ఖానాపూర్: పట్టణంలోని కుమురంభీం చౌరస్తాలో ప్రభుత్వం నూతనంగా నిర్మించిన డబుల్ బెడ్రూం అపార్ట్‌మెంట్‌లో బుధవారం అగ్నిప్రమాదం సంభవించింది. బీ2 బ్లాక్‌లోని 104వ రూమ్‌లో సయ్యద్ షిరీన్, అఫ్సర్ దంపతులు నివాసం ఉంటున్నారు. సెల్‌ఫోన్ చార్జింగ్ ద్వారా షార్ట్‌సర్క్యూట్ జరిగి ఒక్కసారిగా గది నిండా పొగలు కమ్ముకున్నాయి. ఆ సమయంలో గదిలో ఉన్న 8 ఏళ్ల కుమారుడు అర్సన్ ఉండడంతో తల్లిదండ్రులు కేకలు వేయడంతో స్థానికులు వచ్చి కాపాడారు. సమాచారం అందుకున్న ఫైరింజన్ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలార్పివేశారు. ఈ ప్రమాదంలో రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని కుటుంబీకులు, స్థానికులు కోరారు.

మద్యం పట్టివేత



పట్టుకున్న మద్యంతో పోలీసులు

కుంటాల: మండలంలోని లింబా(బి) గ్రామంలో బుధవారం మద్యం పట్టుకున్నట్లు ఎస్సై హన్మాండ్లు తెలిపారు. గ్రామంలో చికెన్ సెంటర్‌లో అక్రమంగా ఉంచిన రూ.3,747 విలువ గల 6.420 లీటర్ల మద్యాన్ని సీజ్ చేశామన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

నర్సాపూర్(జి)లో..

నర్సాపూర్(జి): మండలంలోని కుస్లీ గ్రామంలో బుధవారం ఓ ఇంటి వద్ద అక్రమంగా మద్యం అమ్ముతుండగా పట్టుకున్నట్లు సీసీఎస్ సీఐ మల్లేశ్, ఎస్సై రవీందర్ పేర్కొన్నారు. పట్టుకున్న 17 లీటర్ల మద్యం, దీని విలువ రూ.17,280 ఉంటుందన్నారు. మద్యాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

రూ.5.39 లక్షల నగదు పట్టివేత

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాకేంద్రంలో ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.5లక్షల 39వేల నగదు తరలిస్తుండగా బుధవారం పట్టుకున్నట్లు టూటౌన్ ఎస్సై జీవీ రమణారెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని పాండర్‌కొడకు చెందిన వ్యాపారి రమేశ్ ముత్తిల్వార్ జిల్లాకేంద్రంలో నగదు తీసుకెళ్తుండగా తిర్పెల్లి ప్రాంతంలో పట్టుకున్నామని పేర్కొన్నారు. బంగారం అమ్మిన డబ్బులని తెలిపాడని, ఆయన వద్ద తగిన ఆధారాలు లేకపోవడంతో నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం



బహుమతులు అందజేస్తున్న ఆర్టీసీ ఆర్‌ఎం సోలోమన్

- ఆర్టీసీ ఆర్‌ఎం సోలోమన్
- ముగిసిన ఉమ్మడి జిల్లా పాలిటెక్నిక్ క్రీడాపోటీలు


ఆదిలాబాద్: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ఆదిలాబాద్ ఆర్టీసీ ఆర్‌ఎం సోలోమన్ అన్నారు. జిల్లాకేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో బుధవారం ఉమ్మడి జిల్లా పాలిటెక్నిక్ క్రీడా పోటీల ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఆటలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. నిరంతరం సాధన చేస్తే క్రీడాకారులుగా ఎదుగుతారని పేర్కొన్నారు. కళాశాల విభాగాల అధిపతులు రాజ్‌కుమార్, వీరస్వామి, సుజయ్, రాజన్న, సురేష్, పరిపాలన అధికారి రాజేష్, వ్యాయామ అధ్యాపకుడు కుమారస్వామి, అధ్యాపకులు ప్రవీణ్, గజానంద్‌రావు, రామేశ్వర్ రెడ్డి, సుధాకర్, రవికుమార్, నీల్‌కమల్, విజయలక్ష్మి, క్రాంతికుమార్, జ్యోత్స్నరాణి, యశశ్రీ, సంగీత, హేమలత, మురళీకృష్ణ, సంతోష్ పాల్గొన్నారు.

విజేతలు వీరే..

బాలికల విభాగంలో వ్యక్తిగత చాంపియన్‌షిప్‌గా బెల్లంపల్లి పాలిటెక్నిక్, ఆదిలాబాద్ పాలిటెక్నిక్ ఓవరాల్ చాంపియన్‌గా నిలిచాయి. బాలుర విభాగంలో వ్యక్తిగత, ఓవరాల్ చాంపియన్‌షిప్ ట్రోఫీలను ఉట్నూరు పాలిటెక్నిక్ కళాశాలలు గెలుచుకున్నాయి.

ఓటర్లు పెరిగారు..

- ఐదేళ్లలో 64వేలకు పైగానే..
- 2018లో 3,84,136
- 2023లో 4,48,374
- పురుషులు 28,775
- మహిళలు 35,517



కైలాస్‌నగర్: అసెంబ్లీ ఎన్నికలకు గడువు సమీపిస్తోంది. ఎన్నికల ప్రక్రియను నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం కసరత్తును ముమ్మరం చేసింది. వందశాతం పోలింగ్ నమోదు లక్ష్యంగా తగు చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా ఈనెల 10వ తేదీన ఎన్నికల సంఘం అనుబంధ ఓటర్ల తుది జాబితాను విడుదల చేసింది. దీని ప్రకారంగా గత ఐదేళ్లలో ఆదిలాబాద్ జిల్లాలో 64,238 మంది ఓటర్లు అధికంగా పెరిగారు. పురుషులతో పోల్చితే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. వీరందరూ ఓటు వేసేలా ఇప్పటికే పోల్ చీటీలను అందజేసిన అధికారులు ఓటు హక్కును వినియోగించుకునేలా బీఎల్‌వోల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు.

మహిళలే అధికం..

2018తో పోల్చితే జిల్లాలో ఓటర్ల సంఖ్య భారీగానే పెరిగింది. పురుష ఓటర్లు 39,187 మంది పెరుగగా, బోథ్ నియోజకవర్గంలో 25051 మంది మహిళ ఓటర్లుగా కొత్తగా నమోదయ్యారు. కొత్తగా నమోదైన ఓటర్లలో పురుషులతో పోల్చితే మహిళలే ఎక్కువగా ఉన్నారు. ఆదిలాబాద్ నియోజకవర్గంలో పురుష ఓటర్లు 17,760 మంది పెరగగా, మహిళలు 21,468 మంది కొత్తగా నమోదయ్యారు. అలాగే బోథ్ నియోజకవర్గంలో పురుషులు 11,015 మంది పెరిగితే, మహిళలు 14,049 మంది కొత్త ఓటర్లుగా నమోదయ్యారు. రెండు నియోజకవర్గాలతో పోల్చితే ఓటర్ల పెంపు ఆదిలాబాద్ నియోజకవర్గంలోనే ఎక్కువగా కనిపిస్తోంది.

ఆదిలాబాద్‌అర్బన్‌లో అధికం..

పెరిగిన ఓటర్ల సంఖ్యను పరిశీలిస్తే.. ఆదిలాబాద్ అర్బన్ మండలంలో ఎక్కువగా కనిపిస్తోంది. 2018 కంటే ఈ మండలంలో కొత్తగా 19,850 మంది ఓటు హక్కును పొందారు. అత్యల్పంగా బోథ్ నియోజకవర్గంలోని సిరికొండ మండలంలో 900మంది ఓటర్లుగా నమోదయ్యారు. గతంలో 6020 మంది ఓటర్లు ఉండగా ప్రస్తుతం 6920 మంది ఉన్నారు. ఓటరు నమోదుకు ఎన్నికల సంఘం పలుమార్లు అవకాశం కల్పించడం, అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు చేపట్టి ప్రజలను చైతన్యవంతులను చేయడంతో ఓటర్ల సంఖ్య భారీగా పెరిగిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఓటర్ల సంఖ్యను పెంచగలిగిన అధికారులు వారందరినీ పోలింగ్ కేంద్రాలకు ఏ మేరకు రప్పించగలుగుతారనే దానిపైనే పోలింగ్ శాతం ముడిపడి ఉంది.

ఐదేళ్లలో పెరిగిన ఓట్లు..

ఆదిలాబాద్ నియోజకవర్గంలో..	
నియోజకవర్గం	పెరిగిన ఓటర్లు
ఆదిలాబాద్	2263
జైనథ్	4081
ఆదిలాబాద్‌రూరల్	5221
మావల	7772
ఆదిలాబాద్‌అర్బన్	19850
బోథ్ నియోజకవర్గంలో..	
నియోజకవర్గం	పెరిగిన ఓటర్లు
భీంపూర్	2065
తాంసి	980
తలమడుగు	2275
గుడిహత్నూర్	2843
ఇచ్చోడ	5305
సిరికొండ	900
బజార్‌హత్నూర్	2777
బోథ్	4644
నేరడిగొండ	3257

అప్పుల బాధతో కౌలురైతు ఆత్మహత్య

ఆదిలాబాద్‌రూరల్: పంట పెట్టుబడి కోసం చేసిన అప్పులు తీర్చలేక కౌలు రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదిలాబాద్‌రూరల్ ఏఎస్సై ఫతేసింగ్ కథనం ప్రకారం.. ఆదిలాబాద్‌లోని శ్రీరాంకాలనీకి చెందిన కౌలు రైతు పడాల నవీన్ (43) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గత కొన్నేళ్లుగా ఖానాపూర్ శివారులో నాలుగెకరాలు కౌలుకు తీసుకున్నాడు. ఈఏడాదితోపాటు గతేడాది వేసిన పంటలు దిగుబడి రాలేదు. చేసిన అప్పులు పెరిగిపోవడంతో మనస్తాపం చెంది పొలంలో మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య సుజాత ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

జీవితంపై విరక్తితో వ్యక్తి..



సంతోష్(ఫైల్)

భైంసాటౌన్: పట్టణంలోని బోయిగల్లికి చెందిన పెయింటర్ సంతోష్(56) బుధవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పట్టణ ఎస్సై సందీప్ తెలిపారు. స్థానికంగా పెయింటర్‌గా పని చేస్తుండగా, ఇటీవల రోడ్డు ప్రమాదంలో కాలికి గాయమై ఇంటి వద్దే ఉంటున్నాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మద్యం మత్తులో ఒకరు

భైంసారూరల్: మద్యం మత్తులో ఒకరు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై శ్రీకాంత్ కథనం ప్రకారం..మండలంలోని దేగాం గ్రామానికి చెందిన గంగాధరోళ్ల విఠల్ (40) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం రాత్రి మద్యం మత్తులో ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య లక్ష్మి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి కుమార్తె ఉంది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గుడిహత్నూర్: మండల కేంద్రంలో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. బోథ్ మండలంలోని సాయినగర్‌కు చెందిన జి.భూషణ్‌కుమార్ బైక్‌పై ఆదిలాబాద్ నుంచి బోథ్‌కు వెళ్తున్నాడు. జాతీయ రహదారి 44పై వేగంగా వచ్చి స్థానిక డీఆర్‌డిపో కమాన్ వద్ద డివైడర్‌ను ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. అప్పటికే అక్కడ ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు గమనించి క్షతగాత్రుడిని అంబులెన్సులో రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై ఇమ్రాన్ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

నిర్మల్‌రూరల్: జిల్లాకేంద్రంలోని మంజులాపూర్ శివారులో నేషనల్ హైవేపై మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి (30) మృతిచెందినట్లు రూరల్ ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో మృతిచెందాడని పేర్కొన్నారు. మృతుడు బ్లాక కలర్ జీన్స్, గ్రీన్ కలర్ టీషర్ట్ వేసుకున్నాడు. ఇతని సమాచారం తెలిసినవారు సెల్ 8712659515 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

గంజాయి మొక్కలు ధ్వంసం

బజార్‌హత్నూర్: మండలంలోని ఉమార్ద(జి) గ్రామంలోని పత్తి చేనులో సాగు చేస్తున్న గంజాయి మొక్కలను ధ్వంసం చేసినట్లు సీఐ భీమేశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన మడావి మనోహర్ చేనును సమీప బంధువు కాత్లే శంభు కౌలుకు తీసుకుని పత్తి సాగు చేస్తున్నాడు. దాంతోపాటు గంజాయి సాగు చేస్తున్నారని సమాచారంతో బుధవారం దాడులు చేసి 25 గంజాయి మొక్కలను ధ్వంసం చేశామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు. ఈ దాడుల్లో సీసీఎస్ సీఐ సాయినాథ్, ఎస్సై నరేశ్ పాల్గొన్నారు.

ఆదివాసీ కళాకారుడికి ప్రతిభా పురస్కారం



పురస్కారం అందుకుంటున్న కాత్లె శ్రీధర్

ఇచ్చోడ: మండలంలోని దుబార్‌పేట్ గ్రామానికి చెందిన ఆదివాసీ కళాకారుడు కాత్లె శ్రీధర్‌కు ప్రతిభా పురస్కారం లభించింది. హైదరాబాద్ రవీంద్రభారతిలో మంగళవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో సింగిడి సాంస్కృతిక సంస్థ వివిధ రంగాల్లో రాణిస్తున్న కళాకారులకు వీటిని అందజేసింది. శ్రీధర్‌కు సంస్థ డైరెక్టర్ డీఆర్‌కే విశ్వకర్మ ఈ పురస్కారాన్ని అందజేశారు.

'టికెట్ల కేటాయింపులో ప్రాధాన్యం'

ఎదులాపురం: రాష్ట్రంలో అధికసంఖ్యలో ఉన్న మున్నూరు కాపులకు టికెట్ల కేటాయింపులో బీఆర్‌ఎస్ ప్రాధాన్యం కల్పించిందని రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య అన్నారు. జిల్లాకేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న ఒకే ఒక అభ్యర్థి జోగు రామన్నకు కులస్తులు ఓటు వేసి గెలిపించాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ కేవలం నాలుగు సీట్లు, బీజేపీ ఆరు సీట్లు ఇచ్చిందని అన్నారు. అనంతరం దేవయ్యను సన్మానించారు. సమావేశంలో కాళ్ల విట్టల్, సంతోష్, శంకర్, కొండ గంగాధర్, శశికాంత్, సాయిని రవికుమార్, బొల్లు దేవిదాస్, కందుల రవీందర్, బారే శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



తాపీ పట్టి..ఓట్లు అడిగి

బీఆర్‌ఎస్ ఆదిలాబాద్ అభ్యర్థి జోగు రామన్న ముమ్మర ప్రచారం చేపడుతున్నారు. ఇందులో భాగంగా జిల్లాకేంద్రంలోని పలు కాలనీల్లో బుధవారం పర్యటించారు. ఓ ఇంటి నిర్మాణ పనులు జరుగుతుండగా తాపీ పట్టి గోడకు గిలావ చేశారు. ఈ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటువేసి గెలిపించాలని, అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్



టమాట అమ్ముతూ ప్రచారం

బోథ్: మండలంలోని సొనాల గ్రామంలో బోథ్ బీఆర్‌ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్ బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సంతలో టమాట అమ్ముతూ..ఓట్లు అడిగారు. దప్పుకొడుతూ తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. మాజీ ఎంపీ నగేష్, ఎంపీపీ తుల శ్రీనివాస్, నాయకులు ఉన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

■ష్యూరిటీ, సెక్యూరిటీ, వ్యక్తిగత, వ్యాపార, వ్యవసాయంపై అతి తక్కువ వడ్డీతో రుణం ఇవ్వబడును. Mr. Rohit Wonder Capital PH: 9041114468 [W-788952]

OLD AGE HOME

■ ఒమేగా హోంకేర్ వంట/ఇంటి పనిచేయుటకు, వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను 24 గం॥లు చూసుకొనుటకు మీ ఇంటికే కేర్‌టేకర్స్‌ని పంపబడును. హైదరాబాద్. Ph: 8977639664/ 8977639665 [H-793653]

Finance Services

■ సిరి అసోసియేట్స్ అన్ని రకాల రుణాలు, పర్సనల్ హౌసింగ్ మార్ట్ గేజ్ ఓపెన్ ప్లాట్స్ పై కూడా సిబిల్ ప్రాబ్లం ఉన్న చేయించబడును. సంప్ర: సెల్: 9666142226 [W-1200958]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462